# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 146 గురువారం | 07 డిసెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




## నిట్‌లో ఇస్టమ్ 68వ ఎడిషన్ సదసు

గణితం, సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు

4లో..



# కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం

వివరాలు 2,8లో..











### ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి..
### డిప్యూటీ సీఎంగా భట్టి ప్రమాణం
### తర్వాత 10మంది మంత్రుల ప్రమాణ స్వీకారం
### ఎల్బీ స్టేడియం వేదికగా కార్యక్రమం
### భారీగా తరలివచ్చిన ప్రజలు, నాయకులు

తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ప్రజా పాలనకు పట్టాభిషేకం జరిగింది. గురువారం మధ్యాహ్నం 1.24 గంటలకు ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు 11మంది మంత్రులు ప్రమాణం చేశారు. ఎల్బీ స్టేడియం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అందరిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. రేవంత్ అనే నేను అని .. పలకగానే స్టేడియం మొత్తం హెూరెత్తింది. సీఎం రేవంత్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. తర్వాత మల్లు భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు వరుసగా ప్రమాణం చేశారు. మంత్రులందరూ దైవ సాక్షిగా ప్రమాణం చేస్తే పొంగులేటి పవిత్ర హృదయంతో అంటూ సీతక్క పవిత్రమైన మనస్సాక్షిగా అంటూ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలందరూ తరలి వచ్చారు. - వరంగల్ వాయిస్, వరంగల్

# కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం

**ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి..**
**డిప్యూటీ సీఎంగా భట్టి ప్రమాణం**
**తర్వాత 10మంది మంత్రుల ప్రమాణ స్వీకారం**
**ఎల్బీ స్టేడియం వేదికగా కార్యక్రమం**
**భారీగా తరలివచ్చిన ప్రజలు, నాయకులు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అయితే అనుకున్న సమయానికంటే 15 నిమిషాలు ఆలస్యంగా కార్యక్రమం జరిగింది. లాల్ బహుదూర్ శాస్త్రి స్టేడియం వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ప్రజలను ఉద్దేశించి మొట్టమొదటి సారిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సత్కరించారు. సర్వమత ప్రార్ధనలు చేశారు. ప్రమాణ స్వీకారానికి వచ్చిన అతిథులు, వేలాదిగా తరలి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ధన్యవాదములు తెలిపారు.

### సీఎంగా ప్రమాణ స్వీకారం..

ప్రజాప్రభుత్వం వేదికపై ముందుగా రాష్ట్ర గవర్నర్ తమిళ సై సౌందర్య రాజన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ధనసరి అనసూయ(సీతక్క), తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావులు వరుసగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ప్రమాణం చేసే వారిని ఆహ్వానించారు. దామోదర రాజనర్సింహ ఆంగ్లభాషలో ప్రమాణం చేయగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ పవిత్ర హృదయం సాక్షిగా ప్రమాణ స్వీకారం చేశారు. సీతక్క ప్రమాణ స్వీకారం చేయడానికి మైకు వద్దకు రాగానే కరతాళ ధ్వనులతో స్టేడియం మారు మోగింది.



### సోనియాకు పాదాభివందనం..

జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖలు గతం నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేయడంతో పాటు అధిష్టానంపై అభిమానంతో సోనియాగాంధీకి పాదాభివందనం చేశారు. మంత్రివర్గంలో ప్రమాణ స్వీకారం చేసిన మహిళలు కొండా సురేఖ, సీతక్కలను సోనియా గాంధీ ఆలింగనం చేసుకుని ఆశీస్సులు అందించారు. పక్కనే ఉన్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు వారిని అభినందించారు.

### హాజరైన ప్రముఖులు..

రేవంత్ రెడ్డి పట్టాభిషేకానికి ఏఐసీసీ అగ్రనేతలందరూ తరలి వచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిద్దరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖ్ ఇతర నేతలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎల్బీ స్టేడియం జనంతో కిక్కిరిసిపోయింది. ముఖ్యమైన నేతలందరూ తరలి రావడంతో హైదరాబాద్ మొత్తం సందడిగా మారింది. 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేదికపై నిలిచారు. ప్రమాణం చేసిన వెంటనే సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కాంగ్రెస్ అగ్రనేతలను కలుసుకని అభివాదం చేశారు.

### ట్రాఫిక్ జామ్..

తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా పలువురు ముఖ్యులు హైదరాబాద్ తరలి రావడంతో అసెంబ్లీ నుంచి ఎల్బీస్టేడియం వరకు భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. ముఖ్యంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ట్రాఫిక్‌లో ఇరుక్కున్నారు. ఆయనతో పాటు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క ట్రాఫిక్‌లో ఉండిపోయారు. గవర్నర్ తమిళిసై కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఒంటిగంటకు సభకు చేరుకోవాల్సిన గవర్నర్ ట్రాఫిక్ జామ్ వలన ఆలస్యమైంది. అటు ప్రమాణ స్వీకారం చేయబోయే మంత్రులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ప్రమాణ స్వీకారానికి సమయం దగ్గర పడటంతో నేతల్లో టెన్షన్ నెలకొంది. చివరకు ట్రాఫిక్ లో చిక్కుకున్న అందరినీ ఒకే వాహనంలో ఎల్బీస్టేడియానికి పోలీసులు పంపించారు. ఇకపోతే ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. ప్రమాణం చేస్తున్న సమయంలో ప్రజలు కేరింతలు కొట్టారు. జై రేవంత్ అంటూ నినాదాలు చేశారు. స్టేడియంలో నినాదాలు మార్మోగాయి.



### శాఖల కేటాయింపు..

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితోపాటు మరో 11మంది మంత్రుల ప్రమాణ స్వీకారం చేశారు. వారందరికీ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్ల భట్టి విక్రమార్కకు రెవెన్యూ శాఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి హోం శాఖ, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పురపాలక శాఖ, తుమ్మల నాగేశ్వర్ రావు ఆర్ అండ్ బీ శాఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భారీ నీటి పారుదల శాఖ, దుద్దిళ్ల శ్రీదర్ బాబు ఆర్థిక శాఖ, దనసరి సీతక్క గిరిజన సంక్షేమ శాఖ, కొండా సురేఖ స్త్రీ, శిశు సంక్షేయ శాఖ, పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖ, జూపల్లి కృష్ణారావు పౌర సరఫరాల శాఖ, దామోదర రాజ నర్సింహ వైద్యం, ఆరోగ్య శాఖలను కేటాయించారు.




## పడి లేచిన కెరటం రేవంత్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నల్లమల్లలోని మారుమూల గ్రామం కొండారెడ్డిపల్లిలో పురుడు పోసుకొని నేడు ఆత్మగౌరవ తెలంగాణను సాధించడానికి, అమరుల త్యాగాలను స్వప్నం చేయడానికి, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి అణచివేయబడిన దొరల పాలనకు చమర గీతం పాడి, ఎక్కడ అణచివేశారో అక్కడనే ఎదురు నిలబడి, కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి పట్టాభిషేకం చేశారు. వ్యక్తిగత కక్ష సాధింపులకు పాల్పడిన దొరల పాలనలో 172 కేసులతో రేవంత్ రెడ్డి వంద రోజులు జైలు జీవితాన్ని గడిపాడు. చివరికి తన కూతురి పెళ్లికి కోర్టు అనుమతులతో రావాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో ఆయన జైల్ గోడల మధ్యలో కుమిలిపోయాడు. కానీ ఎక్కడ ఆయన మనోధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. పడి లేచిన కెరటంలా ముందుకు సాగాడు. బంతిని గోడకు ఎంత బలంగా కొడితే అంతే బలంగా వస్తుందన్నట్లు రేవంత్ రెడ్డి దొరల నియంత పాలనపై దండయాత్ర చేశాడు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాత్రి తలుపులు పగలగొట్టి నిరంకుశ పాలనలో రేవంత్ ను అరెస్టు చేశారు. చివరిగా ఎన్నికల్లో ఓటమిని చూశాడు. కానీ ఆయన ఎక్కడ వెనుకడుగు వేయలేదు. 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచి సత్తా చాటాడు. ప్రభుత్వంపై కసితో రగిలిపోయి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా దూసుకుపోయాడు. పార్టీలో గందరగోళం ఏర్పడిన సమయంలో రేవంత్ రెడ్డి అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టే సమయంలోనే కొందరు కాలు పట్టి లాగే పని చేశారు. కానీ రేవంత్ ఎక్కడ వెనకడుగు వేయలేదు. పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రజల కోసం ప్రభుత్వంపై పోరాడాడు. కాంగ్రెస్ అధిష్టానమే ఆయనను అధ్యక్షుడిగా నియమించింది. ఆ సమయంలో చచ్చిపోతున్న పార్టీకి ఆయన ప్రాణం పోశాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఎంపీగా గెలిచిన తర్వాత కూడా చిన్న దొరవారి ఫామ్ హౌస్ లో డ్రోన్ కెమెరా ఉపయోగించాడంటూ రేవంత్ ను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. అంతే దొర మీడియా రేవంత్ ను అణచి వేయాలని చూసింది. ఆయన ఎక్కడ భయపడలేదు. ఆ పార్టీకి అధ్యక్షుడిగా కొనసాగుతూ పార్టీని బలోపేతం చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. మాస్ జనంలోకి రేవంత్ రెడ్డి చొచ్చుకుపోయాడు. ఆయన పేరు వింటేనే ప్రజలు లేచి నిలబడి డ్యాన్సులు చేసే విధంగా అభిమానాన్ని రేవంత్ పొందారు. ఈ 2023 ఎన్నికల్లో సభలతో గొంతు సప్పబడిన ఆయన ఒంట్లో సత్త తగ్గలేదు. కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లను సాధించడంలో రేవంత్ రెడ్డి కీలకంగా వ్యవహరించాడు.

## కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు గురువారం మిఠాయిలు పంచుకొని బాణా సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారీ ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలు లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. అధికారంలో రావడంతో కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఎంతో సంతోషంగా ఉన్నారని, మండలంలో ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ప్రజల వద్ద తెలుసుకుందామని శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు అనిల్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని, మాటిస్తే తప్పని పార్టీ అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, సోమవరం ఎంపీటీసీ సరోజన, మండలంలోని గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, గ్రామ మండల సీనియర్ నాయకులు, సొసైటీ డైరెక్టర్ గంగాధర్ రావు, చిగురు కిష్టయ్య, మండల అనుబంధ సంఘాల అధ్యక్షులు వారితో పాటు వివిధ గ్రామాలలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు

### కాంగ్రెస్ జిల్లా నాయకుడు సాయిలి ప్రభాకర్



**వరంగల్ వాయిస్, పరకాల :** పదేళ్లుగా ప్రజల కోసం ప్రజల పక్షాన ప్రతిపక్ష పాత్ర పోషించి రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలు మెచ్చిన నాయకుడిగా నిలిచి, శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించారు. దీంతో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి, మంత్రులకు కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా నాయకుడు సాయిలి ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రేవంత్ రెడ్డి ప్రజల పక్షాన పోరాటం చేసి కేసులను సైతం లెక్కచేయకుండా ఎన్నో ఆటుపోట్లు అనుభవించి, ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపుతూ గడీల పాలనను బద్దలు కొట్టి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రజలకు సేవకుడిగా సామాజిక న్యాయం, ప్రజాపాలన అందించాలని కోరారు.

## ఎన్పీడీఎల్ చైర్మన్, ఎండీ గోపాల్ రావు రాజీనామా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు గురువారం తన పదవీ బాధ్యతలకు రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సుదీర్ఘ కాలప్రయాణంలో తన పదవి సంతృప్తి ఇచ్చిందన్నారు. వినియోగదారులకు,రైతులకు సేవ చేసుకునే భాగ్యం కలిగిందని, తనకు సహకరించిన ప్రతిఒక్క ఉద్యోగికి ధన్యవాదాలు తెలిపారు.

## ఆసక్తికరంగా రేవంత్, చంద్రబాబు ఫ్లెక్సీ



**వరంగల్ వాయిస్, ఎన్టీఆర్ జిల్లా :** తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా రేవంత్ ప్రమాణ స్వీకారంపై ఆంధ్రాలో వెలసిన బ్యానర్ ఆసక్తికరంగా మారింది. రేవంత్ ప్రమాణ స్వీకారం చంద్రబాబు ఫొటోతో బ్యానర్ ఏర్పాటు ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో నందిగామ, వీరులపాడులో బ్యానర్లు వెలిశాయి. వీరులపాడులో ఎన్టీఆర్, చంద్రబాబుతో తంగిరాల సౌమ్యతో పాటు రేవంత్ ఫొటోలు ఉన్న బ్యానర్ ఏర్పాటు చేశారు. గ్రామ తెలుగుదేశం పార్టీ అభిమానుల తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఫ్లెక్సీలు వెలిశాయి. అటు నందిగామలో చంద్రబాబు,రేవంత్ ఫోటోలతో ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. 'బాబు గారి అనుంగ శిష్యుడు, మేము మెచ్చిన డేరింగ్, డైనమిక్ లీడర్ రేవంత్ అన్నకు పట్టాభిషేకం' అంటూ ఫ్లెక్సీలపై రాశారు. చంద్రబాబు, రేవంత్ ఫోటోలతో వెలసిన ఫ్లెక్సీలను ప్రజలు ఆసక్తికగా తిలకిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫ్లెక్సీలు చర్చనీయాంశంగా మారాయి.

# మురళీనాయక్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎమ్మెల్యే డా.భూక్య మురళీనాయక్ కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రకార్యదర్శి శంతన్ రామరాజు డిమాండ్ చేశారు. గురువారం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో శంతన్ రామరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. తొలుత ఎమ్మెల్యే తల్లిదండ్రులతో శంతన్ రామరాజు కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శంతన్ రామరాజు మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో గత దశాబ్ద కాలంగా ప్రజా హక్కుల విధ్వంసం జరిగిందన్నారు. ప్రజా కంఠక ప్రభుత్వాన్ని పాతరేసి నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం రాష్టానికి శుభసూచకమని ఆశాభావం వ్యక్తం చేశారు. అయిదు కోట్ల ప్రజల ఆశాదీపం ఏనుముల రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా నేడు ప్రమాణస్వీకారం చేయడం ఇందిరమ్మ రాజ్యానికి పునాది అని అన్నారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మానుకోట ఎమ్మెల్యే డా.భూక్య మురళీ నాయక్ కు మంత్రి పదవీ ఇస్తే వెనుకబడిన ఈప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు మానుకోటలో మీటింగులు పెట్టినా ధైర్యంతో ముందడుగువేసి ప్రజల ఆశీర్వాదం అందుకున్న ఎమ్మెల్యే మురళీ నాయక్ మంత్రిగా అర్హుడే అని తెలిపారు. ఎమ్మెల్యే మురళీ నాయక్ కు ఎవరి దయాదాక్షిణ్యాలతో టికెట్ రాలేదని, ప్రజల్లో ఉన్న చరిష్మాకు తోడు జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి సహకారంతో వచ్చిందని అన్నాడు. ఇరవైయ్యేండ్లుగా ప్రజలకు వైద్యం చేస్తున్న మురళీ నాయక్ సమాజంలో ఉన్న రుగ్మతలను నయం చేయడానికి ఎమ్మెల్యేగా వచ్చాడన్నారు. ఎంతో వెనుకబడ్డ మానుకోటలో ఆశించిన అభివృద్ధి జరగలేదని ఇకముందు జరగాలంటే మంత్రిపదవి ఇవ్వక తప్పదని అన్నారు.ఏదేమైనా ఈప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే మురళీ నాయక్ కు ప్రజలు అండగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమ్మగాని కృష్ణమూర్తి, 9వ వార్డు కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, గుగులోత్ చెక్రు, జిల్లా మైనార్టీ జిల్లా నాయకులు మహ్మద్ జహిరుద్దీన్, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ మహమూద్, నోముల తిరుపతి రెడ్డి, మహ్మద్ ఖాజా, సిరిపురం వీరన్న, సత్రం క్రాంతి, బండి శ్రీహరి, కోలా సత్యం, లకావత్ కిషన్, అలువాల లాలయ్య, బి.రాము, ఇక్బాల్, గాంధీ, నల్ల ఆవేత్ పటేల్, తోట సురేష్ పాల్గొన్నారు.

## కొండా సురేఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం

### కాంగ్రెస్ నాయకుల సంబరాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తూర్పు నియోజకవర్గంలోని వెంకట్రామా జంక్షన్ లో కొండా సురేఖ తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కొండా అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నామని అన్నారు. కొండా సురేఖ నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీనియర్ నాయకులు సందెల లాజర్, కూచన రవీందర్, జంగం ప్రభాకర్, గుల్లపల్లి రామకృష్ణ, జేబీ చారి, జస్వీర్ సింగ్, బొల్లుగోడు శ్రీనివాస్, కొండమీది సదానందం, రాజేందర్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు గుడా శారద, నహీమా, జాహిరా, దేవసాని కీర్తి, యూత్ కాంగ్రెస్ సభ్యులు, ఒంటెల కిరణ్, పొన్నాల సంపత్, చింత ప్రభాకర్, మేకలసురేష్, చింత రాజు, చింత విక్రమ్, మేకల రాజు, కొట్టె సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తితో ఎదగాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహిళలు ఎవరిపై ఆధార పడకుండా స్వశక్తితో తమ కాళ్లపై తాము నిలబడి ఎదగాలని మాజీ బీఎస్ఎఫ్ సైనికుడు హవల్దార్ మేజర్ ధరావత్ భాస్కర్ నాయక్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని వెంకటేశ్వర టాకీస్ దగ్గరలో శ్రీదేవి హోటల్ ఎదురుగా వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిని ఆనుకొని రాయల్ దమ్ బిర్యాని సెంటర్ ను మేజర్ భాస్కర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయక్ మాట్లాడుతూ తన భర్త ధరావత్ నందకిషోర్ బార్డర్ ఆర్మీగా కొనసాగుతున్న తరుణంలో తను కూడా ఏదో ఒక పని చేస్తూ తన భర్తతో పాటు తను కూడా ఆర్థికంగా తోడ్పడాలని సదుద్దేశంతో ఆర్మీలో పనిచేస్తున్న ధరావత్ నందకిషోర్ సతీమణి సౌజన్య బిర్యాని సెంటర్ ను తన భర్త సహకారంతో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా ధరావత్ సౌజన్య ను ఆదర్శంగా తీసుకొని సొంత వ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలకు ఆర్థిక సహకారంతో తోడ్పాటు అందించాలని సూచించారు. రాయల్ దమ్ బిర్యాని సెంటర్ విజయవంతంగా వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతూ ధరావత్ సౌజన్య నందకిషోర్ ఉన్నత స్థాయికి ఎదగాలని భాస్కర్ నాయక్ ఆకాంక్షించారు. నూతన బిర్యాని సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తరుణ్, మంగమ్మ, హరీష్, ప్రవీణ్, అరుణ్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా ముందుకు సాగాలి

### సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జీవితం జీవించడానికే ఆత్మహత్యలకు పాల్పడవద్దని, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగాలని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ పేర్కొన్నారు. గురువారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామపంచాయతీ ఆవరణలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ ఏరుగొండ రమేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఆత్మహత్యలపై జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తుల పట్ల, సమాజం స్వాంతన చేకూర్చి మానసిక ధైర్యాన్ని నింపాలని, తనకు ఎవరూ లేరనే అగాధాన్ని పూడ్చే ప్రయత్నంతో భరోసా నింపాలని, కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని దారులు మూసుకుపోయినప్పుడు, ఆత్మహత్య ప్రయత్నం అనే దారి తెరుచుకుంటుందని, ఆ ప్రమాదకర క్షణంలో మేమున్నామంటూ భరోసానిస్తే బయటపడతారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటివరకు 28మందిని కాపాడి, అఖండమైన సంతృప్తితో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం పాల్గొన్న వారిచే ఎన్ని కష్టాలు వచ్చినా ఎదిరిస్తామని, ఆత్మహత్యలు చేసుకోబోమని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, ఉప సర్పంచ్ అరుణముండయ్య, మాజీ సర్పంచ్ నారాయణ, మాజీ సింగిల్ విండో చైర్మన్ బూర్ల ధనంజయ్, గ్రామపంచాయతీ సెక్రెటరీ సతీష్, వార్డు మెంబర్లు కుమార్, తిరుపతి, కనకయ్యలతో పాటు కిషన్, రాములు, అనిల్, నాగమణి శుభ, భాస్కర్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోడీ నాయకత్వం ఈ దేశానికి శ్రీరామ రక్ష

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణంలోని 3,4వ వార్డులకు చెందిన తూర్పాటి శివ, తూర్పాటి సునీల్, తూర్పాటి రమేష్, తూర్పాటి చిరంజీవి, తూర్పాటి సంజయ్, సిరిపాటి అనిల్, పత్తి పవన్, బోదపర్తి పాండు, తూర్పాటి విజయ్, అల్లం షారుప్, ఛార్ల విజయ్ లతో పాటుగా 100మంది యువకులు హిందుత్వ భావజాలం, ప్రధాని నరేంద్ర మోడీ సుపరిపాలన పట్ల ఆకర్షితులై బీజేపీ తొర్రూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ లో చేరారు. బీజేపీ మానుకోట జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రాంచందర్ రావు, బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగా రాంమోహన్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీజేపీ మానుకోట జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రాంచందర్ రావు మాట్లాడుతూ భారత్ ను విశ్వ గురువుగా చేయాలనే సంకల్పంతో అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం సురక్షితంగా, సుభిక్షంగా ఉంటుందని, మోడీ నాయకత్వం ఈ దేశానికి శ్రీరామ రక్ష అని తెలిపారు. పేదల కష్టాలు స్వయంగా అనుభవించిన వ్యక్తిగా తన లాంటి ఇబ్బందులు మరెవ్వరూ పడకుండా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ మోడీ పేదల పక్షపాతి గా మారిపోయాడని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి మాట్లాడుతూ మోడీ సుపరిపాలన పట్ల ఆకర్షితులై బీజేపీలో చేరిన యువకులు అభినందనీయులు అని, తెలంగాణలో ప్రతీ



గ్రామంలో యువత మోడీ నాయకత్వం పై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. బీజేపీ పోరాటంతోనే తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన, నియంత పాలన అంతమైందని, పాలకుర్తి ప్రజలకు విముక్తి లభించిందని తెలిపారు. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం ప్రతీ ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి, 15వ వార్డు కౌన్సిలర్ కొలుపుల శంకర్, ఎస్సీ మోర్చా అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య, అర్బన్ ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్, గంధం రాజు, నర్కుటి ఛలపతి రాజ్, కాగు నవీన్, నూకల నవీన్, శ్రీనాథ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ప్రజల ఆశీస్సులతో ఇటీవల జరిగిన తెలంగాణ శాసన సభ ఎన్నికలలో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసినందుకు, గౌరవ తెలంగాణ రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా నేడు ప్రమాణ స్వీకారం చేసిన ఏనుముల రేవంత్ రెడ్డికి, మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీరాందాస్ యాదగిరి, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల తరపున హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన తెలంగాణ ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తుందని, అలాగే ప్రభుత్వ ఉద్యోగుల వివిధ పెండింగ్ సమస్యలు, పెండింగ్ డీఏల విడుదల, పెండింగ్ లో ఉన్న బకాయిల విడుదల, నూతన పీఆర్ సీ సత్వర అమలు మొదలగు సమస్యలు పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగ సమస్యల పరిష్కారం దిశగా వివిధ ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరిపి పరిష్కరించాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం తరపున కోరారు.

## స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్

**దళితుడికి అత్యున్నత స్థానం**
**కేబినేట్‌లో ఇద్దరు దళితులకు చోటు**
**సామాజిక సమతుల్యతను పాటించిన రేవంత్**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ కొత్త స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయనను ఎంపిక చేసింది. ఇటీవలి ఎన్నికల్లో వికారాబాద్ నుంచి గెలుపొందిన గడ్డం ప్రసాద్ కుమార్ గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇద్దరు ముఖ్యమంత్రులతో కేబినెట్ లో పని చేసిన అనుభవం, అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తి, ఇవి తెలంగాణ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్ విశేషాలు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఈయన రంగారెడ్డి జిల్లా మర్పల్లిలో జన్మించారు. ఇంటర్ చదివారు. 2008 ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వికారాబాద్ నియోజకవర్గం నుంచి గెలిచారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో ఆయన మంత్రిగా పనిచేశారు. 2012లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన వరుస ఓటములను చవిచూశారు. 2022లో టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఇక తాజాగా 2023అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మంచి అనుభవం ఉండడంతో కాంగ్రెస్ ఆయనకు స్పీకర్ బాధ్యతలు అప్పగించింది. దీంతో తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేసినట్లయ్యింది. ఇప్పటికే ఇద్దరు మంత్రులుగా చేరారు. మల్లు భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహలు దళితవర్గాలకు చెందిన వారు. స్పీకర్ కూడా దళితులకు కేటాయించడంతో ఈ ప్రభుత్వంలో దళితులకు పెద్దపీట దక్కింది.

## నిట్‌లో 68వ ఇస్టమ్ సదస్సు



**వరంగల్ వాయిస్, నిట్ వరంగల్ :** ఇండియన్ సొసైటీ ఆఫ్ థియరిటికల్ అండ్ అప్లైడ్ మెకానిక్స్ (ఇస్టమ్ ) 68వ ఎడిషన్ డిసెంబర్ 7నుంచి 9 వరకు నిట్ వరంగల్‌లో నిర్వహించబడుతోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్‌లోని గణితం, సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలు సంయుక్తంగా ఈ సదస్సును భారతదేశంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్‌లో ఇస్టమ్ హెడ్ క్వార్టర్‌తో కలిసి నిర్వహిస్తున్నాయి. ఈ ఉదయం అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో సదస్సు ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీప్ ఓషన్ మిషన్ ప్రాజెక్ట్ ప్రాజెక్ట్, డైరెక్టర్ అండ్ నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీ రమణ మూర్తి హాజరయ్యారు. ప్రొఫెసర్ ఐ.ఎస్.శివకుమార్, ఇస్టమ్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ దీపక్ కుమార్ మైతీ, సెక్రటరీ ఇస్టమ్ , ప్రొఫెసర్ బ్రెస్లిన్ జోజెఫ్, స్లోవేకియా, ప్రొఫెసర్ డేవిడ్ లారోజ్, చిలీ, ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, డైరెక్టర్, నిట్ వరంగల్ ప్రారంభోత్సవానికి అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ ఎంవీ రమణ మూర్తి తన ప్రారంభ ప్రసంగంలో ప్రపంచవ్యాప్తంగా నీరు, ఆహారం, ఇంధన భద్రతలో వాతావరణ మార్పుల సవాళ్లపై ప్రసంగించారు. ప్రొ.బిద్యాధర్ సుబుధి ఇస్టమ్ 68వ కాంగ్రెస్‌కు ప్రతినిధులందరికీ స్వాగతం పలికారు. సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ఫలవంతమైన విద్యాపరమైన చర్చ కోసం చూస్తున్నామని ఆయన అన్నారు. ఇస్టమ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్. ఐ.ఎస్ శివకుమార మాట్లాడుతూ "దేశంలో అనువర్తిత మెకానిక్స్‌లో ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలపై ప్రత్యేక దృష్టి సారించి, సైన్స్, ఇంజినీరింగ్‌లో పరిశోధనలను పెంపొందించడానికి సైంటిఫిక్ కమ్యూనిటీకి చెందిన నాయకులు ఇస్టమ్ సొసైటీని స్థాపించారు" అని అన్నారు. ఇది 68వ సదస్సు అని తెలిపారు. ఇస్టమ్ 2023 ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ హెచ్.పి.రాణి స్పాన్సర్‌లకు ధన్యవాదాలు తెలపడంతో పాటు కాన్ఫరెన్స్ అవలోకనాన్ని అందించారు. 210 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధనా పండితులు ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. రాబోయే మూడు రోజుల్లో తమ పరిశోధనా పత్రాలని ప్రదర్శించనున్నారు.

## సీఎం రేవంత్‌కు అభినందనలు

### బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్ కుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మీరు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను వెంటనే అమలు పరచాలని కోరారు. వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. మీరిచ్చిన హామీలపై తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

## సచివాలయంలో సీఎం రేవంత్ ప్రత్యేక పూజలు

### ఘనంగా స్వాగతం పలికిన అధికారులు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్ర సచివాలయానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రోటోకాల్ ప్రకారం కాన్వాయ్‌లో సెక్రటేరియట్‌కు వచ్చిన రేవంత్ కు సీఎస్ శాంతి కుమారి, డీజీపీ గుప్తా సహ పలువురు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అదే సమయంలో పోలీసులు రేవంత్ రెడ్డికి గౌరవ వందనం సమర్పించారు. లోనికి వెళ్లిన సీఎస్, డీజీపీతో సెక్రటేరియట్ లోనికి వెళ్లిన రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి ఛాంబర్ ఉన్న ఆరో అంతస్తుకు వెళ్లే ముందు పండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. చాంబర్‌లోభార్యతో కలిసి పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనం మధ్య తన సీటులో ఆసీనులయ్యారు. ఆ తర్వాత కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన 11మంది మంత్రులు కూడా చేరుకున్నారు. మంత్రులుగా మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు వరుసగా ప్రమాణం చేశారు. వీరిలో డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క ప్రమాణ స్వీకారం చేశారు. వీరందరితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది.

## జోషి సోలార్ ఏజెన్సీ ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బల్దియా పరిధి 13వ డివిజన్ ఎల్ బీ నగర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన జోషి సోలార్ ఏజెన్సీని నగర మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ జోషి, బస్వరాజు కుమార స్వామి, బస్వరాజు శిరీష శ్రీమాన్, మాజీ కార్పొరేటర్ శారద జోషి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన మోతిలాల్ నాయక్

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ ప్రభుత్వంలో మంత్రిగా కొండా సురేఖ ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా వరంగల్ నగరంలోని కాశీబుగ్గకు చెందిన కాంగ్రెస్ నాయకుడు భూక్య మోతిలాల్ నాయక్ ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## సురేఖను కలిసిన కాంగ్రెస్ నేతలు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** తెలంగాణ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొండా సురేఖను హైదరాబాద్ లోని వారి నివాసంలో వరంగల్ కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కొండా సురేఖను కలిసిన వారిలో కతెరశాల వేణుగోపాల్, బత్తిని రంజిత్ పటేల్, బండి కుమారస్వామి, కస్తూరి వంశీ కృష్ణ, వెల్ది ప్రభాకర్, మామిడాల చలం ఉన్నారు.

# మంత్రిగా ప్రమాణం చేసిన పొన్నం

## ములుకనూరులో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్ గౌడ్ ను మంత్రివర్గంలో తీసుకోవడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ జిల్లా నాయకులు గజ్జెల రమేష్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో మొట్టమొదటి సారిగా మంత్రి పదవీ లభించిందని, ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నంకు బీసీ సంక్షేమ శాఖ కేటాయించారని సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి హోదాలో ఉన్న పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళ మండల అధ్యక్షురాలు చిదురాల స్వరూప, నాయకులు మాచర్ల సదానందం, బొల్లంపల్లి రాజు, మార్పాటి శ్రీనివాస్ రెడ్డి, పచ్చునూరి కరుణాకర్, డబ్బా శంకర్, తాళ్లపల్లి సదానందం, ప్రభాకర్, దండ పెల్లి కమలాకర్, మ్యాక స్వామి, అంబాల రాజు, మాడుగుల చింటూ, నాగరాజు పాల్గొన్నారు.

# 10 నుంచి తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ సేవా డేస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలుగు కళల తోట తెలంగాణ సేవల కోట అనే నినాదంతో 2015లో తెలంగాణా అమెరికన్ తెలుగు అసోసియేషన్ స్థాపించబడింది. తెలంగాణ తరుపున విదేశాలలో ఏర్పడిన మొట్టమొదటి సాంస్కృతిక సంస్థ తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ పైళ్ల మల్లారెడ్డి ఆధ్వర్యంలో 2015లో మొదలై, ప్రస్తుత ప్రెసిడెంట్ కంచరకుంట్ల వంశీ ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలతో దూసుకుపోతున్న తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ తెలుగు రాష్ట్రాలలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే సేవా డేస్ కార్యక్రమాన్ని ఈ సంవత్సరం కూడా నిర్వహించ తలపెట్టింది. ఈ కార్యక్రమంలో విద్య ద్వారా ఉపాధి మార్గాలు, వ్యాపార వృద్ధితో ఆర్థిక వనరుల అభివృద్ధి, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక, జాబ్ ఓరియెంటెడ్, ఉపాధి కల్పన, యూత్, మహిళా సాధికారత కోసం చేసే అవేర్నెస్ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తెలంగాణ అంతటా హైదరాబాద్, అచ్చంపేట, నల్గొండ దేవరకొండ, బోనగిరి, సిద్ధిపేట, వికారాబాద్, యాదగిరిగుట్టలలో ఉంటాయని తెలిపారు. ఈ నెల 10 నుంచి 23 వరకు ఉన్న కార్యక్రమాలకు తెలంగాణ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ప్రెసిడెంట్ వంశీరెడ్డి ప్రజలను కోరారు. ఈ నెల 10న హైదరాబాద్ లో నిర్వహించే మెడికల్ క్యాంపుతో తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ సేవాడేస్ కార్యక్రమాన్ని అంకురార్పణ చేయనుంది. ప్రతిరోజూ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని తెలంగాణలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు, 12న టీ-హబ్ లో టెక్నాలజీపై అవగాహనా కార్యక్రమం, 16న నెక్లెస్ రోడ్డులో 5కే రన్, హెల్త్ పై అవగాహన కోసం నిర్వహిస్తున్నట్లు, 17న వికారాబాద్ లో కృత్రిమ అవయవాల పంపిణీ, 18న వరంగల్ లో మెగా జాబ్ మేళా చివరగా 23న రవీంద్రభారతిలో సేవాడేస్ ముగింపు కార్యక్రమం గ్రాండ్ ఫినాలేలో భాగంగా లైవ్ మ్యూజికల్ నైట్ లో ప్రముఖ యాంకర్ శ్యామల, సింగర్స్ సాకేత్, మధుప్రియతో పాటు వివిధ మిమిక్రి, జానపద కళాకారులతో జానపద, వెస్ట్రన్ నృత్యాలు, గీతాలతో సభ అట్టహసంగా పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ "మెగా కన్వెన్షన్ " "మే 2024"న SEATTLEలో జరుగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాలను ముందుగా తెలంగాణ అంతటా నిర్వహించనున్నట్లు తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రసిడెంట్ కంచరకుంట్ల వంశీ రెడ్డి తెలిపారు. సేవా డేస్ కార్యక్రమానికి Advisory consul chair విజయపాల్ రెడ్డి, Co-chair మోహన్, పటోళ్ల, మెంబర్ : భరత్ మాడాటి, కోఆర్డినేటర్ గా సురేష్ రెడ్డి, వెంకన్న, ఇంటెర్నేషనల్ కోఆర్డినేటర్ గా డా డి.ద్వారకనాథ రెడ్డి, కో కోర్డినేటర్ గా దుర్గా ప్రసాద్ సెలోజ్, ఫౌండేషన్ సర్వీస్ చైర్ గా సంతోష్ గంటారం, ఇంటెర్నేషనల్ వైస్ ప్రసిడెంట్ గా ప్రసాద్ కునారపు, హెల్త్ అండ్ వెల్నెస్ అడ్వైజర్ గా జ్యోతిరెడ్డి దూదిపాల, నర్సింహా పెరుక -కమ్యూనిటీ సర్వీసెస్ చైర్ గా, ప్రెసిడెంట్ గా కంచరకుంట్ల వంశీరెడ్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ గా నవీన్ రెడ్డి మలిపెద్ది బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# రెవెన్యూ గ్రామంగా అక్కంపేట



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామం రెవెన్యూ గ్రామంగా ప్రకటించేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, స్థానిక అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ విజయ సభాధ్యక్షతన గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామసభలో అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ స్వగ్రామమైన అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. గ్రామస్థుల విన్నపం మేరకు అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపుటకుగాను ఆదేశాలు అందాయన్నారు. ఆ ఆదేశాల మేరకు గ్రామసభ ను నిర్వహించి, గ్రామసభ ఆమోదించిన తీర్మానాన్ని తక్షణమే ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. అక్కంపేట గ్రామాభివృద్ధికి అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. కాగా ఈ గ్రామంలో 3432 మంది జనాభా ఉన్నారని, 857 కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో ఎస్సీలు 633 మంది, ఎస్టీలు 24మంది, ఇతరులు 2775 మంది ఉన్నారని తెలిపారు . అక్కంపేట గ్రామపంచాయతీగా ఏర్పడక ముందు ఈ గ్రామం పెద్దాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉండేదని, పెద్దాపూర్ గ్రామపంచాయతీ నుండి 1981లో విభజించి అక్కంపేటను గ్రామపంచాయతీగా ఏర్పాటైనట్లు చెప్పారు. కాగా అక్కంపేట గ్రామం రెవెన్యూ గ్రామంగా ఆమోదం పొందనున్న నేపథ్యంలో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పరకాల రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, తహశీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో చేతన్ కుమార్, ఎంపీటీసీ ఇందిర, వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీ అయ్యప్ప స్వామి శోభయాత్ర



## ఆకట్టుకున్న స్వాముల వేషధారణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉర్సు నాగమయ్య కుటీరం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీ అయ్యప్ప స్వామి శోభయాత్ర(రథయాత్ర) ఉర్సు బొడ్రాయి శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయం నుంచి ప్రారంభం అయింది. ఉర్సు చిన్న మహంకాళి ఆలయం, ఉర్సు కుమ్మరి వాడ, జెండా, బొడ్రాయి సెంటర్ మీదుగా నాగేశ్వరస్వామి ఆలయం వరకు సాగింది. చిన్న స్వాముల వేషధారణ ఆకట్టుకుంది. అయ్యాడు స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, గణపతి, దుర్గా దేవి, శివుడు, మహిషి, రాక్షసులు వేషధారణలో స్వాములు సందడి చేశారు. ఈ నెల 10న జరిగే పడిపూజ, మహా అన్నదానం కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాగమయ్య కుటీరం, అయ్యప్ప సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.







# తెలంగాణ సీఎం రేవంత్‌కు జగన్ శుభాకాంక్షలు

**ఇరు రాష్ట్రాల మధ్య సహకారం పరిఢవిల్లాలని ఆకాంక్ష**

**సుపరిపాలన అందించాలన్న చంద్రబాబు**

**లోకేశ్, రామకృష్ణల శుభాకాంక్షలు**



**వరంగల్ వాయిస్, అమరావతి :** తెలంగాణలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వానికి ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు జగన్ శుభాకాంక్షలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదరభావం, సహకారం పరిఢవిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని సీఎం జగన్ అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి ప్రజలకు సుపారిపాలన అందించాలని చంద్రబాబు ఆకాక్షించారు. లోకేశ్ కూడా శు భాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి సీపీఐ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఇది శుభపరిణామం, తెలంగాణాలో





కాంగ్రెస్, సీపీఐ కలిసి పనిచేశాయి. మా అభ్యర్థి కూనంనేని సాంబశివరావు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ ప్రభుత్వం రాబోయే రోజుల్లో రెండు రాష్ట్రాల మధ్య సామరస్య వాతావరణం ఉండేటట్లు చూడాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం విభజన బిల్లులోని హామీలు అమలు చేయకుండా తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలకు అన్యాయం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి రేవంత్‌రెడ్డి ముందుకు రావాలని రామకృష్ణ కోరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కొత్తగా ప్రమణ స్వీకారం చేసిన మంత్రులకు నందమూరి రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి నియామకం పట్ల తనకు చాల సంతోషంగా ఉందని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని విజయవంతంగా కొనసాగిస్తారని నందమూరి రామకృష్ణ వెల్లడించారు. తెలంగాణ కేబినెట్ మంత్రులకు పేరు పేరున అభినందనలు తెలియచేస్తున్నానని నందమూరి రామకృష్ణ చెప్పారు.



# ప్రజాదర్బార్‌తో ప్రజలకు చేరువ

**పాలనను గాడిలో పెడతామన్న జూపల్లి**

**ప్రజల ఆకాంక్షలకు అనగుణంగా పాలన:మల్లు రవి**





**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ప్రజా దర్బార్‌తో ప్రజలకు దగ్గరవుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మా నిర్ణయాలు చూసి కేసీఆర్‌కు దిమ్మ తిరుగుద్దని అన్నారు. రాష్ట్రంలో నియంత పాలనను అంతమొందించాం. ప్రజా పాలన మొదలు కాబోతోంది. పాలనను గాడిన పెడతాం. ప్రజలు సమస్య చెప్పుకోవడానికి మొన్నటి వరకు అవకాశమే లేదు. ప్రజలందరూ ఎప్పుడ్కెనా ప్రజాభవన్‌కు రావచ్చు. కేసీఆర్ అహంకారం పూర్తిగా దించేస్తాం. చేసిన పొరపాట్లకు కేసీఆర్ పశ్చాత్తాపం చెందాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణలో పాలన సాగుతుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం నాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు 11మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మల్లు రవి గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. తెలంగాణ సంకెళ్లు తెగిపోయాయి. తెలంగాణ ప్రజలకు మరోసారి స్వాతంత్ర్యం వచ్చినట్టు అయింది. ప్రజలు కోరుకున్న తెలంగాణ మళ్లీ వచ్చింది. తొలి సంతకం ఆరు గ్యారంటీల మీద చేసి, తొలి ఉద్యోగం ఇచ్చి, ప్రగతి భవన్‌ను జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌గా మార్చి, ప్రజా దర్బార్‌కి శ్రీకారం చుట్టడంతో తెలంగాణలో తొలి రోజే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితర నేతలు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం హర్షణీయం అని మల్లు రవి తెలిపారు.

# ప్రజలు మార్పును కోరుకున్నారు

**అయినా బీఆర్ఎస్ ఎక్కడా వెనకంజవేయదు**

**త్వరలోనే మళ్లీ కేసీఆర్ పంజా విప్పుతారు**

**మాజీ మంత్రి వేముల ప్రశాంతరెడ్డి**

**వరంగల్ వాయిస్, నిజామాబాద్ :** రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకున్నారని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కేసీఆర్‌కు ఇది తాత్కాలిక విరామం మాత్రమేనని అన్నారు. కొత్త ప్రభుత్వం మంచి పనులు చేస్తే తాము సహకరిస్తామని, అయితే వారు తమ హామీలను నెరవేర్చకపోతే పోరాటాలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయినందుకు కార్యకర్తలు అధ్కైర్య పడవద్దని, అందరికీ అండగా ఉంటామని, ప్రతీ నిమిషం మీ వెంటే ఉంటూ సమస్యలపై పోరాడుతామని ఎమ్మెల్యే కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ ఎన్నికల్లో పార్టీ నాయకుల, కార్యకర్తలు కష్టపడి పనిచేశారని ఆయన అభినందించారు. తనను గెలిపించిన వారికి కృతజ్ఞతు తెలుపుతూనే పార్టీ ఓటమికి నాయకులు, కార్యకర్తలు ఎంతమాత్రం కారణం కాదని అన్నారు. ఎక్కడా నాయకులపై నిందలు మోపవద్దన్నారు. మార్పును ఆహ్వానిద్దామని, కొంతకాలం వేచిచూద్దామని అన్నారు. తెలంగాణ ఉద్యమం నడిపిన తమకు అధికారం ప్రధానం కాదని, అవసరమైతే తెలంగాణ కోసం మరొక ఉద్యమం నడుపుతామని స్పష్టం చేశారు. పదేండ్ల పాటు ప్రజలు తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, మరోమారు మళ్లీ అవకాశం ఇచ్చాంన్నారు. ఇందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కాంగ్రెస్‌ది నిజమైన గెలుపు కాదని, తక్కువ ఓట్లతేడాతోనే చాలామంది ఓడిపోయామన్నారు. అయితే ప్రజల తీర్పును గౌరవించే సంస్కారం మనదన్నారు. వాళ్లలో వాళ్లే కొట్టుకోవడంతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతకాలం ఉంటుందో చెప్పలేమని అన్నారు.కాంగ్రెసోళ్లకు పదవులే ప్రధానమని, ప్రజల సమస్యలు వారికి పట్టవని విమర్శించారు. తెలంగాణకు శ్రీరామరక్షగా నిలిచిన కేసీఆర్ త్వరలోనే మళ్లీ సీఎంగా వస్తారని చెప్పారు. పదేండ్లుగా నియోజకవర్గం అభివృద్ధికి, సంక్షేమానికి ఎంతో కృషిచేశానని అన్నారు.

# కాళేశ్వరం అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావు, కవిత, మెఘా కృష్ణారెడ్డి, ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వర్లు పై కేసు నమోదు చేయాలని ఏసీబీకి ఫిర్యాదు చేసిన న్యాయవాది రాపోలు భాస్కర్ ఏసీబీ ఫిర్యాద్ చేశారు. ఫేక్ ఎస్టిమేషన్ల ద్వారా వేలాది కోట్లు దోపిడీ జరిగిందని భాస్కర్ వారికి తెలిపారు. తాగు, సాగునీటి ప్రాజెక్టు పేరిట ఆర్థిక అవతవకలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ జరపాలని రాపోలు భాస్కర్ ఏసీబీని కోరారు.

# ప్రజాభవన్ ముందు బారికేడ్ల తొలగింపు



## తొలగిన నగర ట్రాఫిక్ చిక్కులు


**వరంగల్ వాయిస్,హైదరాబాద్ :** బేగంపేటలో ట్రాఫిక్ చిక్కుగా మారిన సీఎం అధికారిక నివాసం ప్రగతి భవన్ ముందున్న బారికేడ్లు తొలగించారు. సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణానికి ముందే మౌఖికంగా ఇచ్చిన ఆదేశాలతో అక్కడ ప్రజలకు ఇబ్బందిగా మారిన కంచెను తొలగించారు. ప్రగతి భవన్‌ను 'ప్రజాభవన్'గా మార్చుతానని, సామాన్య జనాలకు సైతం ప్రవేశం ఉంటుందని, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం అనంతరం తొలి మీడియా సమావేశంలోనే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. చెప్పినట్టుగానే అడుగులు పడ్డాయి. ప్రగతి భవన్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలను అధికారులు ఎత్తివేశారు. భవనం ముందున్న బ్యారికేడ్లను తొలగించారు. జేసీబీ సాయంతో పనులు చేపట్టారు. గురువారమే బ్యారికెడ్స్ తొలగింపు పనులు పూర్తి కానున్నాయని అధికారులు తెలిపారు. దీంతో పంజాగుట్ట, సోమాజిగూడ నుంచి వచ్చే ట్రాఫిక్ కు చిక్కులు తొలగనున్నాయి. దీంతో అమీర్ పేట, బేగంపేట మధ్య ట్రాఫిక్ చిక్కులు తొలగనున్నాయి. గత ప్రభుత్వం ఇనుప కంచె కారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రగతిభవన్ ఛాయలకు ఎవరూ కూడా రాకుండా ఇలా చేశారు.





# అన్నీ సినిమాలాగా తీయను : ప్రశాంత్ నీల్

కేజీఎఫ్ సినిమాతో కన్నడ సినీ పరిశ్రమను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాడు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఆ తర్వాత కేజీఎఫ్ 2తో గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రికార్డులను బద్దలు కొట్టేశాడు. ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో మరో ట్రెండ్ క్రియేట్ చేసే సలార్‌ను తెరకెక్కించాడు. ఈ సినిమా డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా అనంతరం టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్‌తో ఎన్టీఆర్ 31 సినిమా చేయనున్నాడు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ పోస్టర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ క్రేజీ కాంబో షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా..ఎప్పుడెప్పుడు సినిమా నుంచి అప్?డేట్‌లు వస్తాయా అని తారక్ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి నీల్ ఒక సాలిడ్ సర్‌ప్రైజ్ ఇచ్చాడు. ప్రస్తుతం సలార్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ప్రశాంత్ నీల్ రీసెంట్?గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ 31 ప్రాజెక్ట్ గురించి చర్చ రాగా.. నీల్ మాట్లాడుతూ.. సినిమా స్టోరీ లైన్ గురించి ఓ హింట్ ఇచ్చాడు. ఈ సినిమా నా ముందు సినిమాలకంటే భిన్నంగా ఉంటుంది. నేను సినిమా జానర్? గురించి మాట్లాడను. కానీ, ఫ్యాన్స్ అందరూ ఇది యాక్షన్ ఫిల్మ్ అని అనుకుంటున్నారు. అయితే ఆడియన్స్‌కు ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. ఇది వరకు లాగా కాకుండా ఈ సినిమాను కొత్త జానర్ కథతో తెరకెక్కిస్తున్నా. ప్రేక్షకులకు దగ్గరయ్యే విధంగా కథ ఉంటుంది అని నీల్ చెప్పుకొచ్చారు. దీంతో సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు.





# ట్రైలరే ఇలా ఉంటే.. మరీ సినిమా

## ప్రేక్షకులను భయపెట్టిస్తున్న పిండం

ప్రేక్షకులను భయపెట్టడమే లక్ష్యంగా తెలుగులో అసలుసిసలైన హారర్ చిత్రం రాబోతోంది. అదే 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉపశీర్షిక. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా డిసెంబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదలకు సిద్ధమవుతుండగా.. తాజాగా చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 3 నిమిషాల 45 సెకన్లు ఉన్న ఈ ట్రైలర్ ఆద్యంతం మేకర్స్ చెప్పినట్లుగానే భయపెట్టేస్తోంది. ఈశ్వరీ రావుతో 'మరణం అనేది నిజంగానే అంతమా. మరణించిన తరువాత ఏం జరుగుతుంది అనేది ఎవరైనా చెప్పగలరా. కోరికలు తీరని వారి ఆత్మలు ఈ భూమ్మీద నిలిచిపోతాయా. ఆ ఆత్మలు మనకు నిజంగానే హాని చేయగలవా' అంటూ నిజ జీవితంలో కూడా ఎందరో తెలుసుకోవాలనుకునే ఆసక్తికర విషయాలను అవసరాల శ్రీనివాస్ అడగడంతో ట్రైలర్ ప్రారంభమైంది. చాలా కాలంగా ఎవరూ నివసించని ఒక ఇంటిలోకి హీరో శ్రీరామ్ కుటుంబం వస్తుంది. ఆ ఇంట్లో వారికి అనుకోని సంఘటనలు ఎదురవుతాయి. ఆత్మ ఆ కుటుంబానికి నిద్ర కూడా లేకుండా, ప్రాణ భయంతో వణికిపోయేలా చేస్తుంది. అలాంటి సమయంలో వారికి సాయం చేయడానికి వచ్చిన ఈశ్వరీ రావు 'మీ కుటుంబాన్ని వేధిస్తున్నది ఒక్క ఆత్మ కాదు' అని చెప్పడం మరింత ఉత్కంఠగా మారింది. అసలు అక్కడ ఏం జరుగుతుంది ఆ ఆత్మల కథ ఏంటి వాటి నుంచి శ్రీరామ్ కుటుంబాన్ని ఈశ్వరీ రావు రక్షించిందా అనే ప్రశ్నలను రేకెత్తిస్తూ ట్రైలర్ నడిచింది.ఇక ప్రారంభంలో అవసరాల శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు సమాధానం అన్నట్లుగా.. 'ఒక వస్తువుని తగలబెట్టినా, నరికినా, పూడ్చినా అది అంతమైపోతుందని మనం భ్రమపడతాం. కానీ ఆ వస్తువులోని అంతర్గత శక్తిని, ఆ ఎనర్జీని మనం ఎప్పటికీ నిర్మూలించలేం. ఇది శాశ్వత సత్యం' అని ఈశ్వరీ రావు చెప్పిన మాటతో ట్రైలర్‌ను ముగించిన తీరు ఆకట్టుకుంది.మొత్తానికి ట్రైలర్ చూస్తుంటే థియేటర్‌లో ప్రేక్షకులు అసలైన హారర్ అనుభూతిని పొందడం ఖాయమనిపిస్తోంది. ఈ ట్రైలర్‌తో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపవుతున్నాయి.







# ఓవరాల్‌గా ఫ్యామిలీ అడియన్స్ మెప్పించిన హాయ్ నాన్న

టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన తాజా చిత్రం 'హాయ్ నాన్న'. నాని 30గా తెరకెక్కుతున్న ఈ సినిమాతో శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. తాజాగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఈ సినిమా సోషల్ మీడియా రివ్యూలు చూసుకుంటే.. బొమ్మ బ్లాక్ బస్టర్ అని తెలుస్తుంది. కథలోకి వెళితే.. ముంబైకి చెందిన విరాజ్(నాని) ఓ ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్. తన కూతురు మహి(బేబీ కియారా ఖన్నా) అంటే విరాజ్‌కు ప్రాణం. పుట్టుకతోనే అరుదైన వ్యాధితో బాధపడతున్న మహికి అన్నీ తానై చూసుకుంటాడు. అయితే ప్రతి రోజు రాత్రి కూతురికి సరదాగా కథలు చెప్పడం విరాజ్‌కి అలావాటు. ఆ కథల్లోని హీరో పాత్రని నాన్నతో పోల్చుకోవడం మహికి అలవాటు. ఓ సారి అమ్మ కథ చెప్పమని అడుగుతుంది మహి. నువ్వు క్లాస్ ఫస్ట్ వస్తే చెబుతానంటాడు. అమ్మ కథ కోసం కష్టపడి చదివి క్లాస్ ఫస్ట్ వస్తుంది. అయినా మహికి తన అమ్మ కథని చెప్పడు విరాజ్. అయితే మహీకి అమ్మ గురించి చెప్పడానికి విరాజ్ ఎందుకు ఆలోచిస్తుంటాడు. అసలు విరాజ్ భార్య ఎవరు, ఆమె ఎందుకు విరాజ్‌ను వదిలేసి వెళ్ళిపోయింది ?, విరాజ్ జీవితంలోకి యశ్న (మృణాల్ ఠాకూర్) ఎలా వస్తోంది ? అనేది తెలియాలంటే హాయ్ నాన్న మూవీ చూడాల్సిందే. ఇక ఈ సినిమా చూసిన నెటిజన్లు హాయ్ నాన్న ఒక ఎమోషనల్ రైడ్ అని చెబుతున్నారు. ముఖ్యంగా కథలోని భావోద్వేగాలు, మలుపులు, నాని, మృణాల్, బేబి కియారా నటన, సినిమా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకు హైలెట్‌గా నిలిచాయని చెబుతున్నారు. అయితే సినిమాలో కొన్ని సీక్వెన్సె స్లోగా సాగడం, అలాగే కొన్ని రొటీన్ సీన్స్ సినిమాకి మైనస్ అయ్యాయని తెలిపారు. ఓవరాల్ గా ఈ 'హాయ్ నాన్న' చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ ను చాలా బాగా మెప్పిస్తోందని అంటున్నారు.



## అలుపెరుగని పోరాటం
# కొండా సురేఖ నైజం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొండా సురేఖ తెలంగాణలో చురుకైన మహిళా రాజకీయ నాయకురాలు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత శాసనసభలో ఆమె వరంగల్ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహించారు. వరంగల్‌లోని ఒక పద్మశాలి కుటుంబంలో కొండా సురేఖ జన్మించారు. తుమ్మ చంద్రమౌళి-రాధా దంపతులు గారాల పట్టి సురేఖ. 1985 లో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎల్‌బీ కాలేజీ నుంచి ఆమె బీకాం పూర్తి చేశారు. ఆమె వివాహం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుతో జరిగింది. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖ 1995లో మండల పరిషత్ సభ్యురాలిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1996లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ విభజన జరగక ముందు 1999లో శాయంపేట నుంచి ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత కాంగ్రెస్ శాసనసభాపక్ష పార్టీ కోశాధికారిగా, అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ కమిటీ, ఆరోగ్యం, ప్రాథమిక విద్యా స్టాండింగ్ కమిటీలలో సభ్యురాలిగా నియమితులయ్యారు. 2000 అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యురాలిగా ఆమె ఎంపికయ్యారు. 2004 శాయంపేట సీటు నుంచి మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల్లో బీజేపీకి చెందిన ప్రేమేందర్ రెడ్డిపై 44 వేల ఓట్ల మెజార్టీతో నెగ్గారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. 2005 మున్సిపల్ కార్పొరేషన్ ఎక్స్ అఫీషియో సభ్యురాలిగా పనిచేశారు. 2009 పరకాల నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ పార్టీకి చెందిన మొలుగూరి భిక్షపతిపై నెగ్గారు. అనంతరం వైఎస్సార్ ప్రభుత్వంలో స్త్రీ, శిశు సంక్షేమం, అభివృద్ధి, వికలాంగులు, జువైనల్ సంక్షేమ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2011 వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మద్దతుగా తన శాసనసభ సభ్యత్వానికి ఆమె రాజీనామా చేశారు. 2013 జూలైలో కొండా సురేఖ వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు వచ్చారు. 2014 కొండా సురేఖ తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరి వరంగల్ తూర్పు నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2018 ఆమె తన భర్తతో కలిసి టీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఆమె పరకాల నియోజకవర్గం నుంచి బీజేపీకి చెందిన డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, టీఆర్ఎస్‌కు చెందిన చల్లా ధర్మారెడ్డి పై పోటీ చేసి పరాజయం పాలయ్యారు. 2023లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వరంగల్ తూర్పునియోజకవర్గంనుంచి 15వేల పై చిలుకు ఓట్లతో బీజేపీ అభ్యర్థిపై విజయం సాధించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన రేవంత్ రెడ్డి కేబినెట్ లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

# మేం పాలకులం కాదు.. సేవకులం

- ప్రజలకు అండగా ఇందిరమ్మ రాజ్య స్థాపన
- దశాబ్దకాల నిరంకుశ పాలనకు చరమగీతం
- ప్రభుత్వంలో ప్రజలే భాగస్వాములు
- ప్రజలనుద్దేశించి ఉద్వేగంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి
- ఆరు గ్యారెంటీలపై తొలి సంతకం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మేం సేవకులం..పాలకులం కాదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వంలో ప్రజలే భాగస్వాములంటూ హామీ ఇచ్చారు. దశాబ్దకాలపు నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని.. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎల్బీ స్టేడియం వేదికగా ప్రమాణం చేసిన తరవాత ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దశాబ్ద కాలం తర్వాత ఇక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టంకట్టడంతో తమ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తుందని, రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి చేయడంతోపాటు ప్రజలకు హక్కులు కల్పిస్తామన్నారు. రైతులు, నిరుద్యోగులు, అమరవీరులు, ఉద్యోగుల కష్టాలు తీరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. సోనియా గాంధీ అండతో, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో, రాహుల్ గాంధీ సూచనలతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. విజయం కోసం రక్తం చెమటగా కారుతున్నా, భుజం కాయలు కాస్తున్నా లక్షలాదిమంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ జెండాను వదలకుండా ఈ ఎన్నికల్లో పోరాటం చేశారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు అందించిన అధికారంతో శక్తివంచన లేకుండా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అమరుల ఆశయ సాధనకు ఇందిరమ్మ రాజ్యం ప్రతిన బూనిందన్నారు. ప్రమాణ స్వీకారం మొదల్కెనపుడే అక్కడ ప్రగతి భవన్ గడీ ఇనుప కంచెలు బద్దలు కొట్టామన్నారు. పోరాటాలు, త్యాగాల పునాదులపై తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని.. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి కోసం ఉక్కు సంకల్పంతో సోనియమ్మ తెలంగాణ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాట ఇస్తున్నా..ప్రభుత్వంలో ప్రజలే భాగస్వాములంటూ ఆయన ప్రకటించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ తో పాటు కాంగ్రెస్ ముఖ్య నేతలు వెళ్లిపోయిన తర్వాత కృతజ్ఞతా సభ నిర్వహించారు. 'జై సోనియమ్మ' అంటూ సీఎంగా రేవంత్ రెడ్డి తన తొలి ప్రసంగం ప్రారంభించారు. ఎన్నో త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ఇందిరమ్మ రాజ్య ఏర్పాటుతో తెలంగాణ నలుమూలలా సమాన అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలో పదేళ్ల బాధలను ప్రజలు మౌనంగా భరించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో అమరవీరుల ఆకాంక్షలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. రెండో సంతకంగా వికలాంగురాలు రజనీకి ఉద్యోగం కల్పిస్తూ ఉత్తర్వులపై సంతకం చేశారు. తెలంగాణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజాభవన్ లో ప్రజా దర్బార్ నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ క్రమంలో ప్రజలందరికీ ఆహ్వానం పలికారు. ప్రజలు ఎప్పుడైనా ప్రజాభవన్‌కు రావొచ్చని, ఈ ప్రభుత్వంలో ప్రజలే భాగస్వాములని స్పష్టం చేశారు. ప్రజాభవన్ వద్ద కంచెలను ఇప్పటికే తొలగించామని అన్నారు. ఇవాళ ప్రగతి భవన్ చుట్టూ కంచెలు బద్దలు కొట్టాం.. రేపు ఉదయం 10 గంటలకు జ్యోతీరావు పూలే ప్రజా భవన్ లో ప్రజా దర్బారు నిర్వహిస్తామన్నారు. మేం పాలకులం కాదు.. సేవకులమని.. విరీరు ఇచ్చిన అవకాశాన్ని ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగిస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తల కష్టాన్ని, శ్రమను గుర్తు పెట్టుకుంటా.. గుండెల్లో పెట్టుకుంటానని భరోసా ఇచ్చారు. అంతకు ముందు రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎల్బీ స్టేడియం కిక్కిరిసిపోయింది. ముఖ్యమైన నేతలందరూ తరలి రావడంతో హైదరాబాద్ మొత్తం సందడిగా మారింది. మీ బిడ్డగా.. మీ సోదరుడిగా మీ బాధ్యతలను తానే నిర్వహిస్తానని రేవంత్ చెప్పారు.

### ప్రధాని అభినందనలు..

సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. ట్విట్టర్ వేదికగా ప్రధాని మోడీ విషెస్ చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి అభినందనలు. రాష్ట్ర ప్రగతికి, పౌరుల సంక్షేమానికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తానని నేను హామీ ఇస్తున్నాను అంటూ కామెంట్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తూ కొత్తగా బాధ్యతలు తీసుకుంటున్న మంత్రులకు మెగాస్టార్ చిరంజీవి ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

## ముళ్లబాట నుంచి
# సీతక్క ప్రయాణం

- నక్సలైట్ నుంచి మంత్రిగా ..
- రాజకీయాల్లో ఎన్నో కష్టాలతో ప్రజాసేవ





**వరంగల్ వాయిస్, ములుగు :** ధనసరి అనసూయ అలియాస్ సీతక్క గురించి తెలియని వారు ఉండరు. ఆదివాసీ కోయ జాతికి చెందిన సీతక్క తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. ఆమె జీవితం ఎందరికో ఆదర్శప్రాయం. తెలంగాణ రాజకీయాల్లో సీతక్కది ప్రత్యేక స్థానం. జూలై 9, 1971లో వరంగల్ జిల్లా ములుగు మండలం జగ్గన్నగూడెంకి చెందిన సమ్మక్క-సమ్మయ్య దంపతులకు సీతక్క జన్మించారు. విద్యార్థి దశ నుంచే పోరాటం మొదలు పెట్టారు. గిరిజన వసతి గృహంలో సరిగా భోజనం పెట్టడం లేదని, బాలికలకు ప్రభుత్వం ఇస్తున్న పది రూపాయలను వసతి గృహ అధికారులు ఇవ్వడం లేదని తోటి విద్యార్థులను కూడగట్టుకుని ధర్నా చేశారు. అప్పుడు ఆమె వయస్సు 13ఏళ్లు. ఆమె పోరాటపటిమను గుర్తించిన పీపుల్స్ వార్ దళం సభ్యుల పిలుపుతో 14ఏళ్ల వయసులోనే ఆమె అడవిబాట పట్టారు. 1988లో 10వ తరగతి చదువుతుండగానే నక్సల్స్ పార్టీలో చేరారు. మావోయిస్టుల్లో చేరినప్పటికీ ఆమె చదువు వదల్లేదు. పోలీసుల అరెస్ట్ చేసినా... జైల్లో ఉంటూనే పదో తరగతిలో ఫెయిల్ అయిన సబ్జెక్టులకు పరీక్ష రాసి పాస్ అయ్యారు. ఆ తర్వాత... ప్రేమించిన తన బావనే పెళ్లాడారు సీతక్క. రెండు నెలల కుమారుడిని వేరేవాళ్ల చేతుల్లో పెట్టి మళ్లీ అడవిబాట పట్టారు. జన నాట్య మండలి ద్వారా ఆదివాసీల సమస్యలపై పోరాటం చేశారు. 20ఏళ్ల పాటు నక్సల్కెట్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు.

### పీహెచ్‌డీ పూర్తి..

ఆ తర్వాత సీతక్క దంపతుల మధ్య విబేధాలు రావడం.. దళంలో మారిన సిద్ధాంతాలు నచ్చక 1996లో బయటికి వచ్చారు. సాయుధ పోరాటాల కంటే ప్రజల్లో ఉండి పోరాడటమే మేలనుకుని జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆ తరువాత ఐటిడీఏలో నెల జీతానికి పనిచేస్తూ చదువు కొనసాగించారు. ఎన్టీఆర్ పిలుపుతో జనజీవన స్రవంతిలోకి వచ్చిన సీతక్క.. 2001లో లాయర్‌గా ప్రాక్టీస్ చేశారు. 2004లో ములుగు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2009లో తొలిసారిగా ములుగు నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో మళ్లీ ఓటమి చవిచూశారు. అనంతరం 2017లో టీడీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మరోసారి ములుగు నుంచి గెలుపొందారు సీతక్క కరోనా సమయంలో అందరూ ఇళ్లకే పరిమితమైతే.. ప్రభుత్వ సహాయం లేకున్నా తన నియోజకవర్గంలోని గ్రామాలన్నీ తిరుగుతూ ఎంతో మందికి ఆహారం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ప్రజా నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలోని గొత్తి కోయ గిరిజనుల జీవన స్థితిగతులపై పరిశోధనలు చేసి డాక్టరేట్ కూడా పొందారు.

### తుపాకీ తూటా కంటే..

నక్సల్కెట్ జీవితం నుంచి లాయర్‌గా.. ఆపై ఎమ్మెల్యేగా... ఆ తర్వాత ప్రజాదరణ పొందిన నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకున్న సీతక్క ఇప్పుడు కేబినెట్ మంత్రి స్థాయికి ఎదిగారు. ముళ్ల బాటలను దాటుకుంటూ.. ప్రజాసేవకు సరైన మార్గం ఎన్నుకుంటూ... ఉన్నత స్థాయికి చేరుకున్నారు. తుపాకీ తూటా కంటే అంబేడ్కర్ బాటలో పయనిస్తే ప్రజల బతుకుల్లో మార్పు తీసుకురావచ్చని భావించారు. గిరిజన మహిళలకు ఉపాధినిచ్చే ప్రభుత్వ సంస్థలో చేరి ఉద్యోగం చేసుకుంటూ సామజికసేవ వైపు పయనం సాగించిన ఆమె కొంత కాలానికే రాజకీయాల్లోకి వచ్చారు. పాలిటిక్స్‌లో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరి ములుగు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. సొంత నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వచ్చారు. ప్రజల పక్షాన పోరాడారు. ఇటు రాజకీయాల్లో, అటు ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ములుగు నియోజకవర్గంలో ఆమె ప్రజలకు ఎంతగా చేరువయ్యారో ఆమె చేసిన సేవలే నిదర్శనం. కరోనా కష్టకాలంలో ఆమె గరిజనులకు అండగా నిలిచారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com